కథానిక

# వర్తమాని

"కనక్ ప్రవాసి"

మండే ఎండలో పేవ్‌మెంటు మీద విసురుగా నడచి వెడుతున్నాడు కనకం. అతని ముఖం చూస్తే దూరంగా దేన్నో ఆశించి వెడుతున్నట్టు, కలవర పడుతున్నట్టు తెలుస్తూంది. ఇటూ అటూ చూడకుండా తిన్నగా వెళ్ళిపోతున్నాడు కంగారుగా, దేన్నో అందుకుందామన్నట్లు. అతనిలో ఏ ఆలోచనా పని చేయటం లేదు. అంతకు ముందే తాను హోటల్‌లో కాఫీ త్రాగి అయ్యరుకు యెంత యిచ్చాడు? అరుకాన్లా, బేడా? అరుకాన్లయితే ఫరవా లేదు. బేడైతే తిరిగి అర్ధణా ఇచ్చాడా? ఏమో, లాల్చీ జేబు తడుముకున్నాడు. చేతికి సమాధానంగా అర్ధణా తగల్లేదు. తను ఇచ్చిందే అరుకాన్లేమో? అబ్బే బేడ ఇచ్చినట్లు జ్ఞాపకం. ఐతే అర్ధణా మోసం చేశాడా! వెధవ అర్ధణా. అసలు డబ్బులు మిగిలాయో, లేదో అనే ఆలోచన ఎందుకు రావాలి తనకి? అతను నడుస్తున్నంత సేపూ అదొక్క ఆలోచనే అతనిలో తీవ్రంగా పని చేసి, తిరిగి తిరిగి ప్రశ్నించింది. కనకం ఆలోచిస్తూనే నడుస్తున్నాడు.

అతనికి అర్ధణాను గురించి ఆలోచన రావటం అదే మొదటిసారి. "అర్ధణాను గురించి ఆలోచించట మేమిటని" అతనికి సిగ్గేసింది. అంతకు ముందెప్పుడూ అతనికి రూపాయికి తక్కువ ఆలోచన రాలేదు. అందువల్లే సిగ్గేసి వుంటుంది, గబుక్కున ఒక్కసారిగా దిగిపోయా నేమిటి? అని. ఇప్పుడైనా ఆ అర్ధణానుగురించి ఆలోచించి ఉండకపోను, తన ఆర్థికస్థితి బొత్తిగా దిగజారిపోవటంవల్ల కాని. తాను ఆ అర్ధణాతో పెద్ద చేయవలసిన ఘనకార్యంకూడ ఏం లేదు. కాని వుంటే ఎందుకైనా ఉపయోగపడునే అని విచారించాడు. అతనికి ఆ ఆలోచన చాలా నీచంగా అనిపించింది. కాకపోతే అతను నెలకి నూటముప్పై తెచ్చుకుంటున్నాడాయె? సిగ్గుకాదు మరి! పిల్లా పీచూ లేదు. తనూ పెళ్ళాం అంతే. మధ్యమధ్య మామగారు పాతికో పరకో పంపకపోతే గతి లేదన్నట్లు కూర్చోటం. అడపాదడపా అన్నగారుకూడ మనియార్డరు చేస్తూనే వుంటాడు కనకానికి. తనకన్న తక్కువ తెచ్చుకొనే మిత్రులదగ్గరికే అప్పుకి బయలుదేరతాడు ఎప్పుడూ. అదే అలవాటుప్రకారం బయలుదేరాడు స్నేహితుడి దగ్గరికి. త్వరత్వరగా నడుస్తున్నాడు కనకం, ఏదో కొంప మునిగినవాడిలా. మరో మూడణాలు లేవు లేకపోతే రిక్షా ఎక్కేవాడే. అతనికి ప్రస్తుతానికి ఒక్క అయిదు రూపాయలైతే చాలు. కావలసిందీ, కోరదగ్గదీ ఇంకేం లేదు.

ఆవేళ ఆదివారం. కనకం, అతని భార్యా, ఇంగ్లీషు ఫిల్ముకి వెళ్ళాలని గట్టిగా నిశ్చయించుకున్నారు. ఇంటివారి అమ్మాయి కూడా తమతో రావటానికి సరదా పడుతున్నట్లు కనకం గ్రహించాడు. అతనికి జీతం అంది యింకా పదిరోజులైనా కాలేదు. అప్పుడే బయలుదేరాడు అప్పు తెచ్చుకోటానికి! ఇంత జీతం వస్తూంది, ఇంత ఖర్చు అవుతూంది అని యెప్పుడూ అతను లెక్క వేయటానికి ప్రయత్నించ లేదు, అతని కంతవరకూ ఏ నెలా మిగిలినట్లు తోచకపోవడం వల్లేనేమో. ఈ నెల యిట్లా అయిపోయింది కదా, మరుసటి నెల అయినా జాగ్రత్తగా వాడుకుందాం అని ఎప్పుడూ పశ్చాత్తాప పడలేదు. అతనికి అవసరానికి డబ్బు దొరికి వుండకపోతే పశ్చాత్తాప పడేవాడేమో. అవసరానికి యెప్పుడూ అతనికి అప్పు దొరుకుతూనే వుంది. అదే ఆశ అతన్ని సినిమాకు వెళ్ళడానికి అయిదు రూపాయల కోసం మండుటెండలో స్నేహితుడింటికి మైలు దూరం నడిపించింది.

కనకం వీథిలో నిలబడే 'సుబ్బారావ్! సుబ్బారావ్!' అని పిలిచాడు స్నేహితుణ్ణి.

యెవరూ పలకలేదు. కాస్సేపు ఆగి మళ్ళీ పిలిచాడు. ఎవరూ పలకలేదు. ఆ యింటి తలుపు తాళంవేసి వుండటం చూసి, సిగ్గు పడుతూ అక్కడనుంచి బయలుదేరాడు విసుగ్గా. కనకానికి గబుక్కుని మెరుపులా ఆలోచన తట్టింది. పోనీ రాజును అడుగుదామనుకుని బయలుదేరాడు. అంతకుముందే తను రాజుకి నాలుగుం పావలా యివ్వాల్సిన మాట జ్ఞాపకం వచ్చింది. వెళ్లడానికి కనకం కొంచెం సందేహించాడు బాగుండదేమోనని "ఆఁ. బాగుండక పోవట మేమిటి! అదీ, ఇదీ ఏకంగా ఒకేసారి కలిపి యివ్వచ్చు" అని సమాధానం చెప్పుకొని ధైర్యంగా వెళ్ళి 'రాజు'ను పిల్చాడు. రాజు పెద్దకొడుకు పన్నెండేళ్ళవాడు కనకం దగ్గరగా వచ్చి, రహస్యంగా "మా నాన్న రేషన్ బియ్యం కొనటానికి చేతిలో లెఖ్ఖలేక మీదగ్గరకు వెడతానని చెప్పి వెళ్ళారు, రాలేదా?" అని అడిగాడు. 'రాలేదు' అని చెప్పేసే చిన్న సమాధానాని కోసం తడుముకొన్నాడు. "ఇదే సమయం చూసి తన దగ్గరకే రాజు కూడా బయల్దేరట మేమిటని" కనకానికి చెడ్డకోపం వచ్చింది. తనకియ్యాబడుతుందని తన దగ్గరకే బయల్దేరాడా అన్నట్లు ఫీలయ్యాడు కనకం. నిజానికి కనకం ఎప్పుడూ యింత ఇబ్బందిపళ్లేదు. ఎప్పుడు అడిగినా వాళ్లు లేదనకుండా వెంటనే అతనికిచ్చేవారు. అతను యెప్పుడూ అప్పులు తీర్చటం ఆలస్యమే! అయినా వాళ్ళు సాధారణంగా అడిగేవాళ్ళే కారు. కనకానికి యిక ఒక్కటే ఆలోచన తట్టింది. శ్రీనివాసం దగ్గరకు వెళ్లి అడుగుదామని నిశ్చయించుకున్నాడు. "తనతో పోట్లాడి పోట్లాడి తన దగ్గరకే అప్పుకోసం వస్తే ఏమనుకుంటాడు వాడు?" అని కనకం బాధపడ్డాడు ముందు.

"ఆఁ ఏమనుకుంటాడేం! తనతో స్నేహం తిరిగి లభించినందుకు ఆనందించి వెంటనే అయిమూ ఇచ్చేస్తాడు." అని నమ్మి బయలుదేరి వెళ్ళాడు.

కాని కనకం దురదృష్టమేమిటో, శ్రీనివాసం ఊళ్ళో లేడని అతని శ్రీమతి జవాబు చెప్పింది. సిగ్గు విడిచి, ధైర్యంచేసి, ఆమెనే ఒక్క అయిదు నోటు బదులు అడుగుదామనుకున్నాడు. ధైర్యమైన వాడే అడగ్గలడు. కాని ఏమూలో దాగివున్న మగతనం అతన్ని పరిహాసం చేసింది. దాంతో తలవంచుకుని మరి చూడకుండా నడక సాగించాడు.

మందంగా నడుస్తున్నాడు. ఎంతో అవమానంతో కుమిలిపోతూ నడుస్తున్నాడు. అయిదు రూపాయలు పుట్టలేదంటే అతనికి సిగ్గేసింది. ఉద్యోగంలో ప్రవేశించిన ఏణ్ణర్థం నుంచీ అతనికి అప్పు పుట్టకపోవడం అనేది జరగలేదు. అంతకు ముందు చదువుకొనే రోజుల్లో కూడ ఎప్పుడూ అప్పులే. ఇంటి దగ్గర్నుంచి మనియార్డరు రావటం తడవుగా అతని రూమ్‌లో వాళ్ళంతా అతన్ని హోటల్‌కు బయలుదేరతీసేవాళ్ళు. ఆ రాత్రి అంతా సినిమాకు తప్పదు కదా! వాళ్ళకు సోడాలకూ, సిగరెట్లకూ తనే ఇచ్చేసేవాడు. ఏకొంతో హోటలుకు చెల్లించేవాడేమో. మళ్ళీ మూడోనాటినుంచి మనియార్డరుకోసం ఎదురు చూట్టంతో సరిపోయేది. వాళ్ళగదిలో పంతులు, రాజూ కూడా అంతే పద్ధతి. ఇక ఎవడికి కావలసినంతవాడు అప్పులకు బయలుదేరటం. వాళ్లు ముగ్గురూ విడుదలైన ఏ కొత్త సినిమా మానేరని? రెండేసి సార్లు మూడేసి సార్లు కూడా. ఆ సినిమా బాగున్నదా లేదా అని కాదు, అది మరోసారి చూశామా లేదా అన్నదే లెక్క. మళ్ళీ మనియార్డరు చాలాభాగం అప్పులు తీర్చటానికే సరిపోయేది. ఇక జరగబోయే నెల గడిచేదెలాగ? అప్పులే. కనకం సెలవులకి ఇంటికి వెడితే అమ్మ అనేది, "నెలకి ఎనభై పంపుతున్నా చాలలేదనే గోల పెడతావేమిరా? వాళ్ల సుబ్బారావుకి నెలకి ఏభై అయితేనే సరిపోతున్నాయట. ఈవేళ ఇంత ఖర్చు చేస్తున్నామంటే కాదు. కొంచెం ముందు సంగతి కూడా ఆలోచించుకోవాలి. ఈవేళ నాన్న సంపాదించి పెడుతున్నారనే సరికాదు. కాలూ చెయ్యా వంగితే తెచ్చి పెట్టే వారెవరూ? ఆలోచించవేమ్రా?"

"మీ సంసారాలు ఎట్లా గడుస్తాయో నాకర్థం కాదు. ఇట్లా గుడ్డిగా ఖర్చుచేస్తే ఎట్లా చెప్పు" అని నాన్న అనేవాడు. తనకి జ్ఞానం

వచ్చినప్పట్నించి, నాన్న చేసే ఖర్చుకి అమ్మ సాధించి పోయటం వింటూనే వున్నాడు. అప్పుడు నాన్న కేకలుపెట్టి అమ్మనోరు మూసేవాడు. చేసేదేంలేక, ఆడపిల్లల పెళ్లిళ్లు చేయవలసి వుంది కదా అనే బెంగ పెట్టుకొని ఏం జరగవలసి వుంటే అదేజరుగుతుందని అమ్మ ఒక నిశ్చయానికి వస్తుండేది. అప్పుడు తనకి యిదంతా ఏదో మామూలు విషయంగానే తోచింది. ప్రతి సంసారంలోనూ ఈ గొడవలు వుంటాయనే అనుకొనేవాడు. ఆ డబ్బు బాధ తన కింతవరకూ ఎప్పుడూ గట్టిగా తెలిసి రాలేదు. "అమ్మ చెప్పినట్లు తన స్థితి కూడ ముందు గతిలేకుండానే సాగుతుందా?"— ఆ ఆలోచనతో అతనికి పెద్ద భయమేసింది. ముచ్చెమటలూ పోశాయి. ఏదో జ్ఞానోదయం కలుగుతున్నట్లు అనిపించింది. నడుస్తూనే సిగరెట్ తీసి వెలిగించాడు. ఒక్క దమ్ము లాగేసరికి వాస్తవ ప్రపంచంలోనికి కళ్లు తెరచి చూసినట్లు అనిపించింది. అప్పటికప్పుడే అతను రైలు స్టేషన్ దగ్గరికి వచ్చేసినట్లు గుర్తించుకోగలిగాడు. తెలియకుండా ఇంతదూరం నడచి వచ్చేశానేమిటి అని అనుకున్నాడు. స్టేషన్ లోకి పోయి కూర్చున్నాడు వచ్చే పోయే రైళ్ళను చూస్తూ. అందులో ఏదో గొప్ప ఆనందం కనిపించింది.

ఇంక ఎప్పుడూ, ఎవరిదగ్గరా అప్పు పుచ్చుకోకూడ దనుకున్నాడు కనకం. అనుకున్నాడే కాని నిశ్చయించుకోలేదు. ఇంకా నెలలో సగంకూడ గడవలేదు. వచ్చినజీతం అయిపోయి అప్పుకు బయలుదేరాడాయె. ఎట్లా పుచ్చుకోకుండా వుండగలగటం? ఏది లేకన్నా రోజుకి పెట్టె సిగరెట్లకీ తొమ్మిది అణాలూ కావలసిందే కదా! పోనీ అనవసరపు ఖర్చు తగ్గిద్దామనుకున్నాడు. సిగరెట్లు ఎలాగా తప్పవు. సినిమాలు తగ్గిస్తే తనకూ, శ్రీమతికీ అసలు జీవితమే నిష్ప్రయోజనం అనిపిస్తుందాయె. అతనికి ప్రతిదీ అత్యవసరపు ఖర్చులాగే కనిపించింది. ఆలోచిస్తున్నాడు. ఇంతలో "కనకం! ఇక్కడున్నావేంరా?" అని పిలిచారు ఎవరో వెనక నుంచి. కనకం తల త్రిప్పిచూశాడు. వెంకటేశ్వర్లు! అవును వెంకటేశ్వర్లు స్టేషన్ లో "గూడ్స్ క్లార్క్"గా పనిచేస్తున్నాడు. "ఏం లేదురా ఈవేళ సెలవుకదూ" అన్నాడు కనకం. "సెలవైతే ఇక్కడెందుకూ హాయిగా క్లబుకు పోలేకపోయినావా" అన్నాడు వెంకటేశ్వర్లు. "అబ్బే! లేదులే!" అని నసిగాడు కనకం. "ఏద్దైనా డబ్బుకావాలా!" అని అడిగాడు కనకం అవసరం గుర్తించినవాడిలా "ఊఁ కావాలి" అనటానికి చచ్చినంత పనైంది. వెంకటేశ్వర్లుదగ్గర అయిదూ తీసికొని కనకం మరి ఆలోచించకుండా ఆనందోత్సాహ సంరంభంలో రిక్షామీద ఇంటికి చేరుకున్నాడు. వర్తమాన స్థితి ఒకటే పట్టిందికాని కనకానికి, భవిష్యత్తునుగూర్చి కించిత్తు కూడా బెంగ లేదు. భవిష్యత్తు ఎప్పుడూ బాగుంటుందనే అతని ప్రగాఢ విశ్వాసం.

---

అర్థరాత్రి దాటింది. కాని కథకుడు యింకా టేబిలు ముందు కూర్చుని ఏదో రాస్తూనే ఉన్నాడు. ఇంకా మేలుకునే ఉన్న భార్య అడిగింది: "ఏమండీ, ఇకనైనా ఆ బ్రహ్మరాత ఆపుచేసి నిద్రపోరాదా?" అని.

"ఉండు ఉండు. అందమైన అమ్మాయి మనోరమ విలన్ చేతుల్లో యిరుక్కుంది. గదిలో యిద్దరే ఉన్నారు. మనోరమను విడిపించచేసి వస్తాను" అన్నాడు కథకుడు.

క్షణమాత్రం ఆగి భార్య ప్రశ్నించింది: "ఆపిల్ల వయస్సెంత?"

"ఇరవై రెండు— ఏం?"

"అయితే దీపం తగ్గించేసి మీ మానాన మీరు వచ్చేయండి. తన గొడవేదో తను చూసుకోగలిగేపాటి వయస్సు గల పిల్లే. తన తంటాలు తను పడుతుంది. మధ్య మీకెందుకు?" అని భార్య మందలించింది.